# దొరలు

## శ్రీమతి ఇల్లిందల సరస్వతీదేవి

వీరన్న ఇస్త్రీలాగూ దానిపైన పొడుగాటి కోటూ వేసుకొని, జరీ తలపాగా పెట్టుకొని హడావిడిగా తిరుగుతున్నాడు. పగలు రెండుగంట లయినా భోజనము చేయటానికి అంతవరకూ తీరుబడి కాలేదు. వీరన్న భార్య ఎల్లి వీరన్న రాకకు ఎదురుచూస్తూ వాకిటి గడపమీద చేతిగోళ్లను కొరుక్కుంటూ కూర్చున్నది.

ఆరోజు సాయంత్రము ఆరు గంటలకు వీరన్న నౌకరి చేస్తున్న క్లబ్బు భవనంలో సభ్యుల సమావేశము జరుగనున్నది. ఇటువంటి సమావేశాలు నెలకొకటివంతున జరుగుతూ ఉంటాయి. ఆ క్లబ్బు ఆవరణములోని తోటలో, లానుమీద కుర్చీలనూ బల్లలనూ అమర్చి, అక్కడక్కడ పూలచెట్లతో నిండిన తొట్లను పెట్టి అలంకరిస్తున్నాడు వీరన్న.

అంతలో కాంటీనునుండి పార్టీకి కావలసిన సామగ్రితో ఇద్దరు మనుష్యులు వచ్చి వీరన్నను పిలచారు. ముఖముమీది చెమటను తుడుచుకొని, వాళ్లను లోపలికి తీసుకొని వెళ్లి సామానులన్నీ గదిలో పెట్టించాడు వీరన్న. సీసాలను బల్లమీద జాగ్రత్తగా భద్రపరచాడు. అప్పటికి నాలుగు గంటలు కావచ్చింది. ఎల్లి రెండుసార్లు భోజనము మాట వీరన్నకు జ్ఞాపకం చేసింది. పనిసందడిలో ఉన్న వీరన్న సరిగా కూర్చోకుండానే భోజనము ముగించి, ఎంగిలిచేతిని సరిగా కడుగుకోకుండానే తిరిగి తన పనిలో నిమగ్నుడై పోయాడు.

ఆ పట్టణము పేరెన్నికగన్న పట్టణాలలో ఒకటి. ఆ క్లబ్బుభవనము తెల్లదొరల పరిపాలనలో ఒక మండలాధికారియైన శ్వేతవర్ణునిచేత నిర్మింపబడినది. ఊరి బైటగా, ఎత్తయిన గుట్టమీద అందముగా కట్టబడినది. విశాలమైన భవనమూ, భవనములో మేలురకపు ఫర్నిచరూ, భవనము చుట్టూ రమణీయమైన పూదోటా, ఆవరణములో కుడిప్రక్కగా ఈతకనువైన జలాశయమూ, దానిచుట్టూ పూపొదరిండ్లూ, భవనానికి ఎడమవైపుగా పెద్ద లానూ, దాని చుట్టూ సున్నము పూసిన ఇటుకల వలయమూ కన్నులపండువుగా ఉంటుంది. వివిధ వర్ణములైన పుష్పజాతులతో తోట ఘుమాయిస్తూ ఉంటుంది. ఆ భవనములో పరులకు ప్రవేశము లేదు. ఆ భవనాంతర్భాగము ఎల్లా ఉంటుందని ఆ పురవాసులెవరైనా వీరన్నను అడిగితే, మా ఊరి బాపనయ్య కథలో చెప్పిన ఇంద్రభవనములా ఉంటుందని నోరు ఊరేటట్లు ముచ్చటగా చెప్తూ ఉంటాడు వీరన్న. ఆ ఊరివాళ్లు చాలామంది దానికి కోలాహలపర్వతమని పేరు పెట్టారు. ఆవరణములో ఒక ప్రక్కగా చిన్న యిల్లు కట్టించి, ఆ తోటనూ ఆ భవనమునూ భద్రముగా కాపాడటానికై భవనమును నిర్మించిన మండలాధికారి వీరన్నను నియమించాడు. తన కేర్పరచిన జీతముతో వీరన్న తృప్తిగా జీవిస్తూ ఆ భవనమును కనిపెట్టుకొని ఉంటున్నాడు. మొదలు మొదలు దొరలతోనూ దొరసానులతోనూ మాట్లాడటము చేతగాక చేతిసైగలతో కాలక్షేపము చేశాడు. కాని త్వరలోనే వ్యాకరణ ప్రశంస విడచి, స్వతంత్రముగా అంగిరీజు భాషలో సంభాషణ నేర్చుకొని, వ్యవహారము నడపుకొనటము ప్రారంభించాడు. వీరన్న తన ఇరవైరెండవ ఏట ఈ నౌకరీలో చేరాడు. ఇప్పుడతనికి తలంతా పండిపోయింది. అరవై సంవత్సరాలు సమీపించాయి.

ఆ క్లబ్బుకు మొదలు మొదలు అంతా తెల్లదొరలూ, దొరసానులూ వస్తూఉండేవారు. తరువాత, క్రమక్రమముగా నల్లదొరలు కూడా ప్రవేశించటము మొదలు పెట్టారు. ఆ క్లబ్బులో ఇంతవరకూ సుమారు ముప్పైమంది కార్యదర్శులూ అధ్యక్షులూ మారగా వీరన్న చూశాడు. అధికారవర్గమూ, సభ్యులూ తమకు తెలియనివివరాలు ఏవైనా వీరన్నను అడిగి తెలుసుకుంటూ ఉంటారు.

ఆ క్లబ్బుపేరు "నవ్వు-నవ్వించు".

సుమారు ఆరుగంట లయ్యేసరికి సభ్యులు ఒక్కొక్కరే రావటము మొదలు పెట్టారు. సమావేశానికి కావలసిన సర్వసన్నాహము చేసి వీరన్న చేతులు కట్టుకొని గేటుదగ్గర నిలబడ్డాడు.

ఎల్లి అవయవసౌష్టవముగల ఇరవదేండ్ల పల్లెపడుచు. ఆరు తులాల బంగారమూ, నలభైతులాల వెండీ పెట్టి వీరన్న రెండు నెలల క్రిందట ఎల్లిని పెళ్లి చేసుకున్నాడు. వీరన్న తాళిగట్టిన పడుచులిద్దరూ వీరన్నకు సంతానము చూపెట్టకుండానే కాలము చేశారు. మూడవసారి చేసుకున్న ఎల్లి వీరన్నకళ్లకు మల్లెపువ్వులా కనబడుతున్నది. అక్కడికి రోజూ బంతి ఆడటానికి వచ్చే నల్లదొరసానమ్మలను చూసి, పాదాల దగ్గరికి చీరె కట్టుకోవటమూ, తల వెంట్రుకలు మెడలమీదికి ముడి వేసుకొని దానిమీద పువ్వులను అర్ధచంద్రాకృతిలో అమర్చుకోవటమూ ఎల్లి నేర్చుకొని ఇప్పుడిప్పుడే "పట్టణపు సోకు" నలవర్చుకుంటున్నది.

ఎల్లి వీరన్నదగ్గరికి వచ్చిన తరువాత క్లబ్బులో ఇది మొదటి సమావేశము. సభ్యులందరూ వచ్చిన తరువాత వీరన్న ఒకసారి తన యింటిలోపలికి వెళ్లి, "తలుపులు వేసుకొని లోపలే ఉండమ"ని ఎల్లికి గట్టిగా చెప్పి తిరిగి తన పనిలోకి వెళ్లిపోయాడు వీరన్న. తన కొరకు కూర్చోవద్దనీ, అన్నము తిని పడుకోమనీ మరీమరీ చెప్పి వెళ్లాడు.

ఏడుగంటల తరువాత ఎల్లి అన్నము తిని మంచముమీద పడుకొని దొర్లటము ప్రారంభించింది. ఎల్లికి ఒంటరి భయము. వీరన్న ఎంతసేపటికీ రాడు!

ఉన్నట్లుండి వెయ్యికుక్కలు ఒక్కసారిగా అరచిన శబ్దము ఎల్లికి వినపడగా, అదరిపడి మంచముమీద లేచి కూర్చున్నది. మరి కాసేపటికి వేయిపిల్లులు ఒక్కసారిగా

(44-వ పేజీ చూడండి)

బిడ్డల అజీర్ణమా?

GRIPELIX తో టిలో వారి కడుపునొప్పి, వాంతి, భేదులు, ఉబ్బరము, జ్వరము, దగ్గు, ఈడ్పులు మొదలగువాని నెల్ల హరించి, వారికి హాయి, మీకు ఆనందము గూర్చును.



గ్రైపెలిక్స్

ఏమరకండి. ఈదివ్యామృతము, బిడ్డల ఆరోగ్యము కాపాడుచు, బలవంతుల గావించుటలో శ్రేష్ఠమైనది.

*Mfrs*· Synthetic Medical Products.

Madras 10.— Ongole.

*Stockists*: Standard Drug & Chemicals,
131, Nainiappa Naik St., Madras

# దొరలు!

(21-వ పేజీ తరువాయి)

మ్యావుమన్న అరపులు వినపడ్డవి. ఎల్లి భయపడి ఆ గదిలో ఒక మూలకు పరుగెత్తింది. తిరిగి అదే విధముగా ఒకసారి పిల్లుల అరపూ, ఒకసారి కుక్కల అరపూ వరుసగా అర గంటసేపు వినవచ్చినవి. ఎల్లి భయముకొద్దీ కళ్లు మూసుకొన్నది.

కాసేపటికి ఎల్లి ధైర్యము తెచ్చుకొని మెల్లగా కిటికీ దగ్గరకు వెళ్లి, కొద్దిగా తలుపులను తెరచి, ఆ శబ్దము ఎక్కడనుండి వస్తున్నదోనని అటూ ఇటూ చూడటము మొదలు పెట్టింది. ఎల్లి యింటికీ సభ్యులు సమావేశమైన లానుకూ సుమారు పదిగజాల దూరము ఉంటుంది. క్లబ్బు సభ్యులు రెండు వరుసలుగా చీలి ఎదురెదురుగా నిలబడినట్లుగా ఎల్లికి కనబడ్డది. ఆ అరపులకు వాళ్లుకూడా భయపడి లేచి నిలువబడినట్లుగా ఎల్లి భావించుకున్నది.

మరికాసేపటికి సహస్రగార్దభము లొక్కసారిగా ఓండ్ర పెట్టినట్లు ఎల్లికి వినపడ్డది. ఈసారి ఎల్లి భయపడకుండా కిటికీతలుపుల సందుగుండా చూడటము మొదలుపెట్టింది. రెండు తెగలుగా ఎదురుబడి నిలువబడిన సభ్యులు ముందుకువంగి నోరు తెరచినట్లూ, ఆ శబ్దము అక్కడినుండే బయలుదేరి వస్తున్నట్లు ఎల్లి అర్థము చేసుకొన్నది. ఈ అరపుల వలన కలిగిన ఆశ్చర్యము ఎల్లి ముఖము మీద అట్లా ఉండగానే, అందరూ కలిసి ఒక్కసారి గొల్లుమన్న శబ్దము వినవచ్చింది. ఎల్లి కిటికీ తలుపులను మరికొంచెము తెరచి చూసి నిర్ఘాంతపోతూ ఉండగా "ఇంకా పడుకోలేదూ ?" అంటూ వీరన్న లోపలికి వచ్చాడు.

"అదేమిటి...అటు చూడు ! ...అటు చూడు!" అని ఎల్లి వీరన్నను గట్టిగా పట్టుకొన్నది.

వీరన్న కిటికీలో తలపెట్టి చూశాడు. ఆ క్లబ్బులో నౌకరీచేస్తున్న వీరన్న అటువంటి దృశ్యాలను అనేకము నిశ్చలముగా చూడటము నేర్చుకున్నాడు. చేతులనూ కాళ్లను నేల కాన్చి, తల పైకెత్తి గాడిదలు ఓండ్ర పెట్టుతున్నట్లు సభ్యులు చూపుతున్న ప్రదర్శన అది!

"అదేమిటి ? వాళ్లు అట్లా చేస్తున్నారు?" అని ఎల్లి వీరన్న ఎదలో తల దాచుకున్నది.

"అవి దొరల ఆటలే ఎల్లీ! నీవు భయపడకు! వాళ్లు దొరలు కదూ మరి! ఇక్కడున్నంతసేపూ అట్లా ఆడుకుంటారు." అంటూ వీరన్న ఎల్లి వీపు నిమిరాడు! ★


## తగింపు ధరలు 5-11-51 ఆఖరు మాత్రమే

యీ దిగువ పేర్కొన్న డ్రైబ్యాటరీ రేడియోలు మా రెడిస్టాకునుండి సప్లయి చేయబడును.

| | | | | | | లిస్టుధర | నెట్ ధర |
|---|---|---|---|---|---|---|---|
| (1) | సిరోక్కో | 6 | వాల్వులు | మోడల్ | T 186 D | రు. 390-0-0 | రు. 234-0-0 |
| (2) | ,, | 5 | ,, | ,, | T 166 D | రు. 375-0-0 | రు. 225-0-0 |
| (3) | రేడియోల | 5 | ,, | ,, | A. B. 5 | రు. 410-0-0 | రు. 287-0-0 |
| (4) | యలిసన్ | 5 | ,, | ,, | M 154 | రు. 450-0-0 | రు. 270-0-0 |
| (5) | స్కైమాష్టరు | 5 | ,, | ,, | D T 491 | రు. 325-0-0 | రు. 195-0-0 |
| (6) | ఆస్టో | 6 | ,, | ,, | చక్రవర్తి | రు. 530-0-0 | రు. 265-0-0 |
| (7) | రోమర్ | 6 | ,, | ,, | డీలక్సు 6 | రు. 390-0-0 | రు. 312-0-0 |

బ్యాటరీ, యేరియల్సు, సేల్ టాక్సు వగైరా ఖరీదు అదనము.

యీ పై రేడియోలకు గమనింపదగిన విషయములు:—(1) డైలులాంపు (2) బాగా పాలీషు చేసిన టేకువుడ్ కాబినెట్టు (3) ఎక్స్టర్నల్ స్పీకరు కనక్షను, గ్రామఫోను పికప్ కనక్షను (4) చూచుటకు అందము, పోర్టబుల్ గాను, వినుటకు విన సొంపగు స్వచ్ఛమైన శబ్దము కలిగియున్నవి. (5) కొన్నరోజు లగాయితు ఒక్క సంవత్సరము ఫ్రీ సర్వీసు. వలయువారు రేడియో ఖరీదులో 25% అడ్వాన్సు సొమ్ము పంపించి రిజిష్టరు వెంటనే చేసికొనగోరెదము. కొద్ది స్టాకుమాత్రం కలదు. ప్రయార్టినిబట్టి సప్లయి చేయబడును.

వివరములకు : మాధవ అండ్ కో

పోస్టుబాక్సు నెంబరు 56, పార్కురోడ్డు, విజయవాడ.


## గ్రంథస్వీకారం


1. శ్రీశాయిబాబా చరిత్రము (యక్షగానము)

రచయిత : విద్వాన్ ధూళిపాళ వేంకట సుబ్రహ్మణ్యము. వెల : 6 అణాలు.

2. జయభేరి (ఖండకావ్యము) కర్తలు : ఉభయభాషా ప్రవీణ జాస్తి వెంకటనరసయ్య, విద్వాన్ ధూళిపాళ వేంకట సుబ్రహ్మణ్యం వెల. 10 అణాలు.

3 శ్రీ త్రినాథవ్రతకల్పము. కర్త : డా. పోంగాకి శ్రీనివాసరావు. వెల. 6 అణాలు.

పై మూడు పుస్తకాలూ ప్రచురించిన వారు : సుందరరాం అండ్ సన్స్, తెనాలి



Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St., Madra